# మామూళ్ళోయ్! దసరా మామూళ్ళోయ్!!

**- యలమర్తి అనూరాధ**

కాలింగ్ బెల్ అదే పనిగా మ్రోగుతోంది. అప్పుడే తొలి కోడి 'కొక్కొరొకో' అంటూ ప్రక్క గుడిసెలోంచి కూస్తోంది. బాబును చదివించటానికి పెట్టిన గడియారం కూడా అరవటం మొదలుపెట్టింది. కళ్ల కలకలతో రెండు రోజుల నుంచీ బాధపడుతున్న నా కళ్లు మాత్రం పుసులు కట్టి విచ్చుకోనంటున్నాయి. ఎక్కడ శ్రీవారికి నిద్రాభంగం అవుతుందో అని బెంబేలు పడుతూ గ్రుడ్డిదానిలా అలాగే బెడ్‌రూమ్‌లోంచి హాల్‌లోకి వెళుతూ టీపాయ్‌కి గుద్దుకున్నా.

"ఏం పాపం చేశానో ఏమో ఉదయాన్నే దెబ్బ..."

ఆ వచ్చినవాళ్ల మీద పీకలదాకా కోపంతో వెళ్లి తలుపు తీశా.

"అయినా నువ్వు సరిగ్గా చూసుకోక నడిచి ఆ వచ్చేవాళ్లని తిడతావేం?" చిన్న విషయాన్ని కూడా వదలని అంతరంగం అననే అంది. ఇదెప్పుడూ ఉండేదే! తెరుచుకోనంటున్న కళ్లను కొద్దిగా బహుకష్టం మీద తెరిచి చూశా. పాల ప్యాకెట్లు ఇచ్చే పావని.

"అమ్మగారూ! దసరా మామూలండీ!"

అసలే బలవంతంగా కళ్లు తెరిచిన బాధ ఒక ప్రక్క మరో ప్రక్క దసరా మామూలు అడగటానికి ఇదా సమయం. రెండూ కలిసి కోపం... దానికి బలి ఆ చిన్నారే...

"మామూలు అడిగే టైమ్ ఇదా! తరువాత వచ్చి పట్టుకెళ్లు. సరేనా?" అంటూ పాలప్యాకెట్లను తీసుకెళ్లి ఫ్రిజ్‌లో పెట్టి శుభ్రంగా సబ్బు పెట్టి ముఖం కడుక్కుని రూపేష్‌ని లేపటానికి వెళ్లింది భారతి.

"ఒరేయ్ రూపేష్! లేవరా..." తట్టి లేపింది.

"అమ్మా! ఒక్క అయిదు నిముషాలమ్మా! ప్లీజ్ అమ్మా! ప్లీజ్ అమ్మా!" అంటున్నాడు వాడు కళ్లు తెరవకుండానే. దుప్పటిని ఇవతలికి లాగేస్తే మళ్లీ దగ్గరకు లాక్కుని, కప్పుకొని అటు తిరిగి పడుకున్నాడు.

"అబ్బా! వీడిని లేపడమంత చిరాకైన పని ఇంకోటి ఉండదు. ప్రొద్దున్నే మూడ్ అంతా పాడుచేస్తాడు విసిగించి. పావుగంట టైమ్ తినేసే అలవాటు వీడిది. ఏం చేస్తాం? తప్పదుగా..."

"రూపూ! ఈ రోజే చివరి ఎగ్జామ్! లే నాన్నా! రేపటినుంచీ నేను లేపే పని ఉండదు. నువ్వు లేవనూ అక్కర్లేదు. చదువుకోవటానికి లేవరా! ఈ ఒక్కరోజు లేవరా బాబూ!" ఇష్టం లేకపోయినా బ్రతిమాలే ధోరణిలో.

"అలాగే మమ్మీ! ఇంకొక్క నిముషం" మమ్మీ అంటే కరిగిపోతానేమోనని.

మొత్తానికి వాడిని లేపి, పుస్తకాల దగ్గర కూర్చోబెట్టి వంటింట్లోకి దారిపట్టేటప్పటికి పావుగంట దాటనే దాటింది.

ఇలా వెళ్లి పాల ప్యాకెట్లు కత్తిరించి గిన్నెలో పోసి పొయ్యి మీద పెట్టిందో లేదో మళ్లీ బెల్!

పేపరు అయి వుంటుందని వెళ్లి తలుపు తీసింది. నిజమే! పేపరు తీసుకుని లోపల పెడుతుంటే "దసరా మామూలండీ!" అననే అన్నాడు పేపరు తెచ్చే ప్రవీణ్.

"ఉండు! తెచ్చిస్తాను" అంటూ లోపలికి వెళ్లి పది రూపాయలు తెచ్చి అతని చేతిలో పెట్టాను.

"పాపం! అమ్మానాన్నా లేకపోయినా ఎవరిమీదా ఆధారపడకుండా ఇలా పనులు చేసి చదువుకునే ప్రవీణ్‌కి ఎంతిచ్చినా తప్పు లేదు. అడిగి నఖరానా చేసి దండుకునే వాళ్లకంటే వీళ్లకు అడగకముందే ఇవ్వాలి. కాకపోతే పనివేళ కాకుండా వచ్చి తీసుకువెళితే బాగుంటుంది" అనుకుంది.

మధ్యలో రూపేష్ చదువుతున్నాడా, లేదా అని ఒకసారి తొంగిచూసింది గదిలోకి. వాడి తల పుస్తకంలోనే ఉండటంతో 'హమ్మయ్య!' అనుకొంది.

కుక్కర్ పొయ్యిమీద పడేస్తే కాస్త హాయిగా ఉంటుంది అని తనలో తనే మాట్లాడుకుంటూ బియ్యం కడిగింది. రాత్రి తరిగి ఉంచుకున్న దొండకాయ ముక్కలను కూడా ఉప్పు రాసి ఒక ప్లేట్‌లో పెట్టింది. చిన్న గిన్నెలో పప్పు కడిగి కొలత నీళ్లు పోసి ముక్కల మధ్య పెట్టింది. కుక్కర్ మూత పెట్టాక వచ్చింది అనుమానం- 'క్రింద నీళ్లు పోశానా, లేదా' అని. అందుకే ఒకటికి రెండుసార్లు చూసుకోవటం. ఒక్కసారి తీసి చూసుకుంటే పోతుంది, లేదంటే క్రింద మాడటం, పని అవకపోవటం- డబల్ పని.

ఇంతలో మళ్లీ కాలింగ్ బెల్ మ్రోగుతోంది.

ఎవరో... కాసేపు కొట్టుకోనీ. అలా వెళితే ఇక్కడ పని మరిచిపోతుంది అనుకొని కుక్కర్ మూత తీసి నీళ్లున్నాయని నిశ్చయించుకున్నాక మూత పెట్టేసి అప్పుడు వెళ్లి తలుపు తీసింది.

పనిపిల్ల పంకజం.

"ఏంటమ్మగారూ! ఇంత లేటు... ఇంకాసేపు రాకుంటే వాణమ్మ గారింటి కెళ్లిపోదామనుకుంటున్నా!" సాగదీసుకుంటూ చెప్పింది.

"ఇంకా నయం! వెళ్లిపోయావు కాదు. నిన్న సినిమా అంటూ సాయంత్రం పని ఎగ్గొట్టావ్! అన్ని అంట్లూ బయటే ఏడుస్తున్నాయి. ఒక్క నిముషం లేట్ అయితే ప్రక్కింటికి పోతానంటావా?"

"ఊరికే అన్నానమ్మా!"

ఊరికే ఏమిటి? ఒక్కోసారి అలా పక్కింటికి వెళ్లి అక్కడినుంచీ మూడ్ తన్నేసి పని ఎగ్గొట్టి ఉడాయించిన రోజులు కూడా ఉన్నాయి" మనసులోనే తిట్టుకుంది.

ఆ మాట దాని ఎదురుగా అంటే ఇంకామయినా ఉందా? పని చేసుకోలేక వాళ్లమీద ఆధారపడుతుంటే వీళ్లు ఆడింది ఆట, పాడింది పాటగా తయారవుతోంది.

"నువ్వు ఊరికే ఏదీ అనవే తల్లీ! నిజంగానే అంటావని నాకు తెలియదూ" అనటంతో...

"లేదమ్మగారూ! ఈ రోజు ఎవరిల్లూ వదిలేది లేదు. అందరికాడా దసరా మామూలు తీసుకొని రెండొందలు పెట్టి 'రాశి సిల్కుచీర' కొనేసుకోవాలి సాయంత్రానికల్లా."

అంటే, దాని ఉద్దేశం ఒక్కొక్కరు ఇరవై రూపాయలు ఇవ్వాలని. పది ఇళ్లల్లో పనిచేస్తోంది మరి. కాదంటే పని మానేస్తుందేమో అని భయం. అమ్మో! ఆ పని చెయ్యటం తన వల్ల కాదు. ఇప్పటికే ఆఫీసుకు పరిగెత్తాల్సి వస్తోంది. ఇక ఇది కూడా రాకపోతే ఆఫీసుకు రోజూ ఆలస్యమైపోయి, ఆఫీసర్ కోపానికి బలి అయి ఉద్యోగం ఊడగొట్టుకోవాల్సిందే. అంతదాకా తెచ్చుకుంటుందా? ఊహుఁ!

"సరే, దానిదేముంది! వెళ్లేప్పుడు పట్టుకెళుదువుగానిలే" అని ప్రక్క పొయ్యిమీద వేడినీళ్లు పెట్టింది.

అది అంట్లు తోముతూనే కబుర్లు మొదలుపెట్టింది. దానికి చేతులు పనిచేస్తుంటే నోరు కూడా పనిచెయ్యాల్సిందే!

"అమ్మగారూ! మీకు ఆఫీసులో దసరా మామూళ్లు ఇస్తారా?"

"మాకెందుకిస్తారే పిచ్చిముఖమా! మా దగ్గిర పనిచేసే ప్యూన్లకిస్తారు!"

"అంటే మీకెవరూ ఇవ్వరన్నమాట" ఆశ్చర్యంగా ఆ సబ్బు చేతిని బుగ్గమీద పెట్టింది. అక్కడంతా నురగ మబ్బు తునకలే. మళ్లీ దాన్ని పైట చెంగుతో తుడిచేసుకుంటూ.

"మీకివ్వకపోయినా మీరందరికీ ఇవ్వాలి కదమ్మా!"

"ఆఁ! ఏ ఒక్కరినీ వదలటానికి లేదు. చివరకు మా ఆఫీసులో వాళ్లకి కూడా మేమివ్వాల్సిందే!"

"మీకేంటి లేమ్మా! మీకాడ సానా డబ్బులుంటాయి గదా!"

"అవునవును" అంది. లేదంటే పరువు పోతుంది. ఇది పదిళ్లల్లోకీ వెళ్లి టముకు వేస్తుంది. ఆయమ్మ చెప్పేవి అన్నీ అబద్ధాలే అని ప్రచారానికి శ్రీకారం చుడుతుంది. ఒక్కోసారి నిజం కంటే అబద్ధమే మేలు చేస్తుంది. నిన్ననే టైపిస్ట్ 'తపన' దగ్గిర అయిదు వందలు అప్పు తెచ్చింది. మళ్లీ నెలలో ఇస్తానని చెప్పింది. ఏదైనా గుప్పెట మూసి ఉంచితేనే చిదంబర రహస్యం తన కాపురంలా.

పావుగంటలో పాత్రలన్నీ దడదడలాడించేసి, రెండు చెంబుల నీళ్లు వాటిపై దొర్లించేసి కడిగాననంటే కడిగానని పారబోసి పారిపోయింది ఇరవై రూపాయల నోటు తీసుకుని.

"రూపేష్! పంకజం వెళ్లాక తలుపు వెయ్యరా!" అంది.

"అలాగే" అని తలుపు దగ్గరకు వెళ్లినవాడు, "అమ్మా! ఎవరో వచ్చారే!" అన్నాడు.

"సరే! నువ్వు లోపలికి వెళ్లి చదువుకో" అని వాడిని పంపి,

"ఎవరు మీరు?" అని అడిగింది వాళ్లని.

"చెత్తకుండీలో చెత్త ఎత్తేవాళ్లమమ్మా! దసరా మామూలు కోసం"

"అది మీ డ్యూటీ కదా! దానికి దసరా మామూలెందుకు?" ఇవ్వనని చెప్పకుండా అంది.

"అలాగా! ఒక వారం మీ సందులోకి ట్రాక్టరు తిప్పకుండా ఉంటే తెలుస్తది మా విలువేంటో! సంవత్సరానికొకసారి మాకు పడేసే ముష్టి పది రూపాయలకు పది ఆరాలు!" అన్నాడు. అడిగి తిట్టించుకోవటం అంటే ఇదే!

"అనవసరంగా కదిపాను" అని నన్ను నేనే తిట్టుకుని, పది తెచ్చి అతని చేతుల్లో పెట్టా.

ఇక ఎవరొచ్చినా అడగకూడదని నిర్ణయించుకున్నా!

ఎవరిని కదిపినా తమ పనే ముఖ్యమైనదంటారు.

వెళ్లే వాళ్లకు ఎదురు వస్తూ మరో నలుగురు...

"ఏంటిరోయ్... మామూలుకేనా?"

"అవును రా!"

"మీదెంత?" అంది స్ట్రెయిట్‌గా.

"మేము అయిదుగురం పంచుకోవాలి. మురికి కాలువలు తీసేవాళ్లం. చూసి ఇవ్వండమ్మా"

పాతిక తెచ్చి ఇచ్చా– "ఇక ఈ రోజంతా నా పని ఇంతేలాగుందే" అనుకుంటూ.

"రూపూ! చదివింది చాలు, బ్రష్ చేసుకుని స్నానానికి రా! నీళ్లు తోడేస్తున్నా!"

"అలాగే అమ్మా! తలుపు వేసెయ్యనా?"

"వద్దురా! అలా తీసే ఉంచు. వెయ్యటం, తియ్యటం వేస్ట్"

ఇడ్లీ స్టాండ్ తీసి ప్లేట్లను కడిగింది.

"ఈ దసరా మామూళ్లప్పుడు ఒక వారం రోజులు సెలవుపెట్టి పారిపోవాలనిపిస్తుంది. దసరా అయ్యాక మనల్ని ఎవరూ అడగరుగా" అంది తన కొలీగ్ దమయంతి లంచ్ అవర్‌లో.

"భలేదానివే! దసరా అయిపోయినా, ఆ నెలంతా తీసుకుంటూనే ఉంటారు తల్లీ! వడ్డీ వసూలు చేసుకొనే వెంకటేశ్వరస్వామి చందం. నువ్వు ఉద్యోగానికి కొత్త కాబట్టి ఇలా మాట్లాడటం."

వెంటనే తపన అందుకుంది.

"అవును. ఇది మందులేని జబ్బు! ఎవరు మొదలుపెట్టారో కానీ మధ్యతరగతి వాళ్లను పీల్చి పిప్పి చేస్తున్నాయ్ ఈ దసరా మామూళ్లు" అంది. ఆఫీసులో విషయాలు గుర్తు వస్తే నవ్వు వస్తుంటుంది.

డ్రస్సు వేసుకుంటున్న రూపేష్, "అమ్మా! బస్సు డ్రైవర్‌కి, ఆయాలకి దసరా మామూలంటమ్మా! అడగమన్నారు."

"అలాగే నాన్నా! రెండు యాభైలు తీసుకువెళ్లి ఇద్దరికీ ఇచ్చెయ్! వాళ్లే పంచుకుంటారు. మనం వెళ్లేప్పుడు చెప్పు, పట్టుకెళ్దాం" అంది.

కుక్కర్లో ఇడ్లీ పెట్టింది. పచ్చడి చేసి, పప్పులో తాళింపు పెట్టి వీడిని పంపిస్తే ఆయన క్యారేజ్‌లోకి రసం చెయ్యాలి.

రసం అనుకోగానే భర్త గుర్తుకొచ్చాడు.

ఇక్కడ తను పనిలో ఊపిరాడక సతమతమవుతుంటే, అక్కడ హాయిగా నిద్రపోతున్నారు మహారాజులా.

కాస్త కూడా సాయం చెయ్యాలనిపించదా అంటే–

"నీకు ఇబ్బందిగా ఉంటే ఆఫీసు మానేసెయ్ భారతీ! నాకు మాత్రం పనిచేసే అలవాటు లేదు. ఉన్నంతలోనే సర్దుకుందాం" ఒకటే మాట.

ప్రతి చిన్నదానికి అప్పులకు పరుగెట్టకూడదని ఇది తను తీసుకున్న నిర్ణయమే!

నిజమే! ఆయనలా నిశ్చింతగా ఉండగలిగితే తనకీ పాట్లు ఎందుకు? ఒక్కోసారి విసుగుతో మానేస్తే పోదూ అనిపిస్తూ ఉంటుంది. కానీ కనీస ఖర్చులకైనా వస్తాయని పాటుపడటమే.

"రూపేష్! టిఫిన్ తిందువుగానీ, రా!"

"వస్తున్నానమ్మా!"

వాడికి టిఫిన్ పెడుతూ క్యారేజ్ సర్ది, తలుపుకు తాళం వేసి బయలుదేరింది.

తలుపులు తీసి, వెయ్యాలన్నా బద్ధకమే తన పతిదేవులకు.

వాడిని సందు చివర బస్సు ఎక్కించి వస్తుంటే గ్యాసు బండి వస్తోంది.

నవ్వుతూ పలకరించాడు.

"ఏంటమ్మగారూ! దసరా మామూలుకు ఎప్పుడు రమ్మంటారు?"

"ఇపుడే వచ్చి తీసుకువెళ్లు" అడిగాడు కదా అని తరవాత రమ్మంటే "వీళ్లిచ్చే ముష్టి ముప్పై రూపాయలకు ముప్పై సార్లు తిరగాలా" అని అన్నా అంటారు. లేదా మనసులో అన్నా తిట్టుకుంటారు. తిట్టుకుంటే తిట్టుకున్నారని వదిలేద్దామనుకున్నా, అది దృష్టిలో పెట్టుకొని నేను లేనపుడు ఎదురింట్లో ఇవ్వాల్సిన గ్యాస్‌ని "డోర్ క్లోజ్డ్" అని తిరిగి ఇచ్చేశాడంటే, ఇక తనకంతకంటే నరకం ఉండదు. ఏం చేస్తాం? సర్దుకుపోవాల్సిందే!

మెట్లు ఎక్కుతుంటే ఎదురింటావిడ, "భారతీ! నిన్న నువ్వు ఆఫీసుకెళ్లాక కరెంట్ వాళ్లు వచ్చి దసరా మామూలు అడిగారు. నాది ఇచ్చాను. ఆవిడెప్పుడుంటారో ఏమో! మీరు ఇచ్చేసి వాళ్ల దగ్గిర తీసుకోండని" అన్నారు.

"నాకు తెలియదు. మీరే ఆవిడున్నప్పుడు అడిగి తీసుకువెళ్లండి అంటే వినరే! నాతో గంటసేపు వాదించారు. ఇక ఓపిక లేక నీ డబ్బులు కూడా నేనే ఇచ్చాను. యాభైకి తక్కువ తీసుకోనన్నాడు. అసలు వంద అడిగాడు. ఏదో బేరం ఆడి వప్పించా."

"కరెంట్, గ్యాస్, ఫోన్ వాళ్లతో మనం మాట్లాడేదేమీ ఉండదు" అని మనసులో అనుకుంటూ, "సర్లెండి! నేనిచ్చేస్తాను" అంది.

"తొందరేం లేదు. సాయంత్రం ఇద్దువులే! మళ్లీ వాళ్లు వచ్చి నీ దగ్గర కూడా అడిగి తీసుకుంటారేమోనని హడావిడిగా వచ్చి చెప్పా."

"థాంక్సండీ!" అన్నా. ఆవిడ మాట చెప్పకపోయినా, వాళ్లు నిజాయితీ చూపించకపోయినా మరి నా పర్సుకి రెండు చిల్లులుంటాయిగా.

ఎనిమిదిన్నర అయింది. 'అయ్యబాబోయ్' అనుకుంటూ స్నానానికి పరుగెట్టింది.

అద్దం దగ్గర బొట్టు పెట్టుకుంటుంటే అప్పుడు ఒళ్లు విరుచుకుంటూ వచ్చాడు ప్రకాష్.

ఆమె భర్తగా అన్నీ డిమాండ్ చేసి అనుభవిస్తున్న ఆ ఇంటి ఆఫీసరు.

ఆఫీసులో ఆఫీసర్లు తాము చేసే దానికన్నా క్రింద వారిని హెరాస్ చేసి చేయించుకొనేదే ఎక్కువ. అదే తంతు ఇంట్లో కూడా!

అందుకే ఇంటికీ, ఆఫీసుకీ పెద్ద తేడా తెలియదు భారతికి.

రూపేష్ ఉన్నా అందరి పిల్లల్లా అల్లరి చేయడు. తన పని ఏమిటో, తన చదువు ఏమిటో, అంతవరకే. అదో అదృష్టమే! ఈయన బుద్ధులే వాడికీ వస్తే ఈపాటికి ఏ సన్యాసాశ్రమంలోనో చేరిపోయేది.

# అక్కరకు రాని చట్టము

## మనిషి - ఆడమనిషి

– ఆరుద్ర

ఘోర ఘోరాతి ఘోర గంభీర తపస్సు చేశాను.

ఓటు ఒక్కంటికి పది చొప్పున సంచులు సంచులు విప్పి కుమ్మరించేను. పీపాలు పీపాలు కోయించి వర్షం కురిపించేను. ఆడది ప్రత్యక్షమైంది.

"అబ్బీ! నీ చిత్తమొచ్చిన వరాలు కోరుకో" అంది. "ప్రజలంతా వార్తాపత్రికలు కోడైకూసే అబద్ధాలు మేసి నెమరు వేసేటట్టు చూడు తల్లీ!" అని ప్రార్థించాను. "వెర్రివాడా! ఇది నేను ప్రసాదించినా, ప్రసాదించక పోయినా ప్రజలు చేసే పనే కాబట్టి ఇంకో వరం అడుగు" అంది.

"చిత్తం మాతరో! రేడియో నీడన ప్రజలు పడగవిప్పి ఆడేటట్టు చెయ్యి" అన్నాను. "వెర్రి నరుడా! ఇదీ తొలి వరం జాతిలోకే చేరుతుంది. ఇంకో వరం ఏరుకో" అంది.

"అయితే అమ్మా! ఉపన్యాస వేదికల ముందు కునికిపాట్లు పడుతూ ప్రజ కరతాళ ధ్వనులతో నా ప్రబోధాన్ని హర్షించేటట్టు చెయ్యి" అన్నాను. "వెర్రికుట్టా! ఇది ఇన్నాళ్లూ జరగలేదంటావా? అయితే నీకు నేనెలా ప్రత్యక్షమయ్యాననుకొంటున్నావు?" అంది.

"అవునవును. నేను పట్టింది ఆయుధం, పలికింది శాసనం అయేటట్టు కనికరించు" అని కోరాను. ఆడది మంజూరు చేసింది.

"నా శాసనానికి అడ్డు లేకుండా ఉండేటట్టు అనుగ్రహించు" అని ప్రార్థించాను. ఆడది శాంక్షన్ చేసింది.

"నా శాసనం భూత భవిష్యద్వర్తమానాలలో ఒకే రీతిగా వర్తించేటట్టు చూడు" అని అడిగాను. ఆడది ప్రసాదించింది.

"నా శాసనం నా ఇష్టం వచ్చినప్పుడు అమలు జరిపేందుకు వీలయేటట్టు చూడాలి" అన్నాను.

ఆడది "ఓకే! శాసనం నీ బుర్రలో పుట్టకముందే ఎవర్నయినా దాని ప్రకారం శిక్షించే హక్కు నీకిచ్చేశాను" అంది.

"నా శాసనం ఎవరి బుర్రమీద పెడితే వాళ్లు బుగ్గయిపోవాలి గానీ ఒక షరా–నా బుర్రమీద గానీ, నా పార్టీవాళ్ల బుర్రమీద గానీ ఇది వర్తించకూడదు."

ఆడది "ఇది కూడా ఇచ్చాను గానీ, నాదొక షరతు. ఈ వరాలు నాపట్ల గానీ , నా తరఫు వాళ్ల పట్ల గానీ వర్తించవు" అని మాయమైంది.

(15.6.1947 "ఆనందవాణి" సంచిక నుంచి)

తలుపులు దబదబా బాదుతున్న చప్పుడు...

"ఎవరా?" అని చూస్తే, ఎదురుగా పదిమంది. వాళ్ల లీడరనుకుంటా, మధ్యలో ఒక పుస్తకం పుచ్చుకొని.

"టెలిఫోన్ వాళ్లమమ్మా! మామూలుకి వచ్చాం. ఒక్కొక్కళ్లు మూడు వందలకి తక్కువివ్వటం లేదు. అందరూ వందల్లోనే!"

పుస్తకం చూపెట్టబోయాడు.

ఆ అంకె వినగానే గుండె గుభేలుమంది. ఇక ఊరుకుంటే లాభం లేదని,

"మీరు చెప్పేది ఆఫీసుల్లో, వ్యాపారస్థుల దగ్గిర. ఇంకా చెప్పాలంటే దొంగ కనెక్షన్లు తీసుకునేవాళ్లు, మీ దగ్గరకి లంచాలు పంపించి తక్కువ బిల్లులు వచ్చేట్లు చేసుకునేవాళ్లు. అలా ఇవ్వక మరెలా ఇస్తారు?"

"భలే చెప్పావులేమ్మా? అవి పాత రోజులు. ఇప్పుడున్న బిల్లులన్నీ కంప్యూటర్లోనే ప్రిపేర్ అవుతున్నాయి. అలాంటి పనులేం ఉడకవు."

"అదంతా మాకు తెలియదు. మేము ఉద్యోగస్థులం. మేం పాతిక కంటే ఇవ్వలేం."

"మేం యాభైకి తక్కువ తీసుకోం" అని దర్జాగా వెళ్లిపోతున్నారు.

"ఓ బాబూ! ఉండండి" అని పిలిచాడు ప్రకాష్.

"భారతీ! వాళ్లతో గొడవలెందుకు? యాభై ఇచ్చెయ్" ఏదో సంపాదించి తెచ్చి నన్ను దాయమని ఇచ్చిన డబ్బులు తెమ్మన్న లెవల్లో.

బయటివాళ్ల ముందు గొడవ ఎందుకని తెచ్చి ఇచ్చా.

వాళ్లు అటు వెళ్లగానే, నేనేమైనా అంటానేమో అని కాబోలు గబుక్కున బాత్రూమ్‌లో దూరి దభేలున తలుపు వేసుకున్నాడు.

"మహా తెలివి"

తొమ్మిదిన్నరకు తలుపుకి తాళంవేసి బయటపడ్డాం. స్కూటర్ మీద ఆఫీసు దగ్గర దింపటం ఒక్కటి ఆయన దినచర్యలో నాకు చేసే సాయం. లేకుంటే తను ఆ సిటీబస్సుల పాలిట పడాల్సి వచ్చేదే!

స్కూటర్ ఎక్కబోతున్న దాన్నల్లా దిగాను. పోస్ట్‌మాన్ 'సహాయం' వస్తూ ఉండటం చూసి.

నేను ప్రతి సంవత్సరమూ సంతోషంగా దసరా మామూలును పిలిచి ఇచ్చే వ్యక్తి అతనే!

అందరిలా అతనిదీ డ్యూటీనే అయినా దూరదూర తీరాలలో వున్న ఆత్మీయుల మాటల్లాంటి కబుర్లను, స్నేహితుల స్వీట్ స్వీట్ సంగతులను అందించే పోస్ట్‌మాన్ అంటే నా ప్రియనేస్తంలానే అనిపిస్తాడు.

అదేమిటో అతని ముఖంలో విసుగు ఎప్పుడూ కనిపించదు.

ఎప్పుడూ చిరునవ్వు చిందిస్తూనే ఉంటాడు.

అడగకముందే "అమ్మగారూ! మీకున్నాయండీ!" అంటాడు, లేకపోతే "మీకు లేవండీ!" అని.

అతను ఎదురుకాకపోతే ఆ రోజంతా ఏదో కోల్పోయిన భావన.

నా ఆలోచనల్లో నేనున్నానో, అతను చెప్పేది నేను వినలేదో- అతను నన్ను దాటిపోతున్నాడు.

"హలో! పోస్ట్‌మాన్‌గారూ!" అంటూ పిలిచా.

"పిల్లలకు స్వీట్స్ కొనిపెట్టండి" అని ఒక యాభై నోటు చేతిలో పెట్టా.

గుర్రుగుర్రున చూస్తున్న మా ఆయన చూపులను చూడనట్లే తల ప్రక్కకి త్రిప్పుకున్నా "ఇంక గూర్ఖాకి ఇవ్వాలి. ఇంకెవరెవరు మిగులున్నారా" అని ఆలోచిస్తూ.

"అంత ఆలోచించాల్సిన పని లేదు. ఎవరూ రావల్సినవి వదులుకునేవారు లేరు. మనం మరిచిపోయినా వాళ్లు గుర్తుపెట్టుకుని తప్పక వస్తారు" అంది మనసు.

ఈ మాటకు దసరా మామూళ్ల గొడవ అయిపోయినట్లే. ఆఫీసులో అయితే వారం క్రితమే కలెక్షన్లు పుచ్చుకోవడం, బహుమతులు కొనుక్కోవడం కూడా జరిగిపోయింది. పెద్ద పెద్దవన్నీ అయిపోయేటప్పటికి కాస్త తెరిపిన పడినట్లే ఉంది ప్రాణం.

మనకి దసరా మామూళ్లు ఇచ్చే వాళ్లుంటే ఇలా ఆనందంగా పంచవచ్చు. అలా లేదే! పోనీ ఇచ్చినంత పుచ్చుకుంటారా అంటే అదీ లేదు. ఇంతని డిమాండ్! మన బడ్జెట్‌ని బట్టి ఎంతిస్తే అంత తీసుకుంటే- ఇచ్చే వాళ్లకీ, తీసుకునే వాళ్లకీ బాగుంటుంది. ఊహుఁ అది ఎక్కడా కనిపించదు. ఎంత అడిగితే అంతివ్వటమే! వరకట్నం నిరంతర సమస్య అయితే, ఇది సంవత్సరానికి ఒకసారి వచ్చే సమస్య! దీనికి మందు ఎవరు కనిపెడతారో! ఎప్పుడు వస్తుందో ఆ రోజు! అంతవరకూ ఈ తిప్పలు తప్పవేమో! ఇవి కూడా వద్దని వ్యతిరేకిస్తూ మద్యపాన నిషేధంలా ఉద్యమాన్ని లేవదీస్తే చాలా బాగుంటుంది. "ఎంత సేపూ వాటి గురించి ఆలోచించటమేనా! నేను వచ్చి పలకరిస్తున్నా చిరునవ్వు లేదే" అని నా నేస్తం గాలి తల్లి పలకరింపుకు హాయినా నవ్వాను. మామూళ్ల మాటే మరిచాను.

✦ ✦ ✦

"దసరా మామూళ్ల బారినపడే ప్రతి మనిషికీ ఈ నా కథ అంకితం."

●

# వనిత గోదావరి

పాపికొండల పయోధరాల మీది పైట సవరించి
రెల్ల దుబ్బుల రైకముడి సడలించి
సైకత వేదికల నడుమ తానభిసారికయై
'నాయుడు బావ' రాకకై నిరీక్షించు
నందూరి 'యెంకి' నాటి వాసంత ప్రణయ గోదావరి.

సేపించని స్తన్యం పైబడి పసిపాప పాలకేడ్వ
ఆకొన్న కళ్లతో 'అమ్మా' అని దాహార్తి కేలుమోడ్చ
జాలిజాలిగ రాలు కన్నీటి బొట్లు చారికలు గట్ట
నిట్టూర్పుల సెగలుమిసిన నిస్సహాయ గృహిణి నేటి గ్రీష్మతప్త గోదావరి.

ప్రవాసమేగిన ప్రియుడు చేరి చెంత నిలువ
బిగి కౌగిట వలపుల సుడులు త్రిప్ప
పులకిత తనువల్లరి పరువంపు పరవళ్లు తొక్కిన
ప్రౌఢ గంభీర శృంగార దేవేరి నాటి శ్రావణ ప్రళయ గోదావరి.

తెలివెన్నెల జడివానల తానమాడి
జిలుగు తారల జలతారు కోక గట్టి
స్వచ్ఛ కౌముదీ విరిబాలఁ సిగను తురిమి
సంధ్య సిందూర రాగాల తిలకమద్ది
పైరు పచ్చల పూర్ణగర్భధారిగ అభయమొసగెడి
అన్నపూర్ణ నాటి శారద శాంత గోదావరి.

మంచుతెరల మేల్ముసుగు లోపల
మాతృత్వ మధురిమలు పొంగిపొరల
పొత్తిళ్ల పసికూన నెదకు హత్తుకొనుచు
పరవశించెడి పచ్చిబాలెంత నాటి హేమంత విశ్రాంత గోదావరి.

జరాభారమున జవసత్వముడిగిన మగనికి
సగము మేనై సపర్యలు చేసి, సొలసి
ఎదిగి వచ్చిన బిడ్డల నెడబాసి, తానొంటరియై
మోడువారిన తరులమ్రోల ఏటికో
ఎదురుతెన్నులు చూచు శల్యావశిష్ట వృద్ధమూర్తి నాటి శిశిర రుజాగ్రస్త గోదావరి.

పురుషాహంకార పెనుతుపానులు ముంచెత్తినపుడు
దురాచార దుశ్శాసనం వెల్లువై వికటించినపుడు
నయన జ్వాలికా విస్ఫులింగాల
మరణమృదంగ మహోగ్రనాదాల
రుద్రవీణాభీషణ పదఘట్టనల తాండవించెడి
ఆదిశక్తి ఆమె నేటి వనిత గోదావరి!

\- పి. అపర్ణ